# దీపావళి సిసింద్రీలు మినీ మినీ కథలు



## బాకృతెలివి

## సి. యస్. ఆర్. లక్ష్మీప్రసాద్

సుబ్బరాజు ఆరుబైట పడక్కుర్చీలో పడుకుని చుట్ట నోట్లో పెట్టుకుని గుప్పు గుప్పున పొగ వదుల్తూ తన్మయత్వంలో వున్నాడు.

"దండాలండి సుబ్బరాజుగారూ!" అంటూ వచ్చి సుబ్బరాజు ఏకాంతానికి భంగం కలిగించాడు రామయ్య.

"రావోయ్ రామయ్యా: ఏవిటి విశేషాలు. ఎట్లా వుందోయ్ మీ నాయుడి కడుపునొప్పి?" అన్నాడు సుబ్బరాజు.

"ఎట్లా వుందంటే అట్లాగే వుందండీ యమయాతనపడిపోతున్నాడు. డాక్టరొస్తే 'నాకు విషంయిచ్చి చంపేయండి, నేనీబాధ భరించలేను బాబోయ్' అని ఏడుస్తున్నాడు."

రామయ్య మాటలు సుబ్బరాజుకి సంతోషాన్ని కలిగించాయి. నాయుడు పోతే తనకి ఎదురు లేదు. మూడుసార్లు నుంచీ తనని ఓడించి ప్రెసిడెంటయిపోతున్నాడు. ప్రెసిడెంటవాలని ఎన్ని దేవుళ్ళని వేడుకున్నాడో లెక్కలేదు. ఏ దేవుడో తన మొర ఆలకించినట్టుగా నాయుడికి మాయదారి రోగం వచ్చి మూలపడ్డాడు. ఈ వాళ కాకపోతే రేపు. తను ప్రెసిడెంటు కాబోతున్నాడు గర్వంగా మీసాలు మెలేశాడు సుబ్బరాజు.

"నాయుడు పోతే తమకి ఎదుర్లేదు. తమరే పంచాయితీ ప్రెసిడెంటు." అన్నాడు రామయ్య సుబ్బరాజు మనసులో ఆలోచనలు కనిపెట్టినట్లుగా.

"ఛ....ఛ...నేను ప్రెసిడెంటు అవడం కోసం నాయుడు పోవాలా? తప్పు....తప్పు....అలాగనుకో కూడదు మనం. పెద్దలేమన్నారూ! అపకారికి ఉపకారం చెయ్యమన్నారు. నాయుడు నాకు పగవాడే- కాదనను. అంతమాత్రాన నాయుడు చావాలని కోరుకోకూడదు. కర్మకాలినప్పుడు చావు ఎవరికైనా తప్పదు."

"నేనేవన్నానండీ వున్న సంగతి" అన్నాను రామయ్య సుబ్బరాజు ధోరణి అర్థంగాక.

ఆపదలో వున్నప్పుడు పగవాడేమిటి? మన వాడేమిటి? అంతా మనుషులమే....

వద.... వద.... పాపం నాయుడిని చూసొద్దాం." అంటూ చేతి కర్ర చేత బట్టుకుని బయల్దేరాడు సుబ్బరాజు.

రామయ్య సుబ్బరాజుని అనుసరించాడు.

తనను చూడ్డానికి సుబ్బరాజు వచ్చినందుకు సంతోషించినట్లు కనిపించాడు నాయుడు. కానీ నిజానికి సుబ్బరాజుని చూడ్డంతోనే అతనికి కడుపు నొప్పితో పాటు గుండెల్లోపోటు మొదలైంది. ఎందుకంటే తను చచ్చిపోతే సుబ్బరాజు పంచాయితీ బోర్డు ప్రెసిడెంటయిపోతాడే అని.

"ఎలాగుంది నాయుడూ?" అన్నాడు సుబ్బరాజు పరామర్శిస్తూ.

"ఇంకే వుంది సుబ్బరాజూ! అంతా అయిపోయింది. బాధ భరించ లేకుండా వున్నాను." అంటూ కళ్ళ నీళ్లు పెట్టుకున్నాడు నాయుడు.

"అలాగనుకోమాకు నాయుడూ! ఇప్పుడు నీకేమైంది. కడుపు నొప్పేగదా! అదే పోతుంది. లేనిపోని బెంగపెట్టుకోకు...." అంటూ ఓదార్చాడు

"నీకు తెలియదు సుబ్బరాజూ! నేను పడే నరకం. విషం తాగి చావాలనిపిస్తున్నది."

సుబ్బరాజు పైకి తనని ఓదారుస్తున్నా లోలోపల తను చస్తున్నందుకు ఎంతో ఆనందిస్తున్నాడని నాయుడికి బాగా తెలుసు.

ఇంతలో నాయుడికి దగ్గు తెర వచ్చింది. సుబ్బరాజు అక్కడ కూర్చుని వుండడం వల్ల నాయుడి భార్య, కూతురు, దూరంగా వుండిపోయారు. సుబ్బారాజే లేచి కూజాలో నీళ్ళు గ్లాసులోకి వంచి తాగించాడు.

తర్వాత పది నిమిషాలు కూర్చుని వెళ్ళిపోయాడు సుబ్బరాజు.

సుబ్బరాజు వెళ్ళిన పావుగంట తర్వాత నాయుడు పెద్దగా కేకలు పెడుతూ కాళ్ళూ చేతులూ కొట్టుకో సాగాడు. "కడుపులో మంట....మంటని...." ఏడవ సాగాడు. డాక్టర్‌కి కబురు వెళ్ళింది.

డాక్టర్ వచ్చాక "డాక్టర్ గారూ! సుబ్బరాజు మంచి నీళ్ళలో విషం కలిపి తాగించాడండీ ఇక నేను బ్రతకను...." అంటూ ఏడ్చాడు నాయుడు.

డాక్టర్ యస్. ఐ. కి కబురుచేసి తను చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీ చేశాడు. కానీ ప్రయోజనం కనిపించలేదు. యస్. ఐ. వచ్చేటప్పటికి చావుబ్రతుకుల్లో వున్నాడు నాయుడు. "సుబ్బరాజు తనను పలకరించడానికి వచ్చి మంచినీళ్ళలో విషం కలిపి యిచ్చాడని" నాయుడు యస్. ఐ. ముందు స్టేట్‌మెంట్ యిచ్చాడు.

తర్వాత నాయుడు హరీ అన్నాడు.

పోస్ట్ మార్టమ్ రిపోర్టులో నాయుడు విష ప్రయోగం వల్లనే మరణించాడని తేలింది.

ఆ విషం సుబ్బరాజు ఇచ్చాడనీ నాయుడి స్టేట్‌మెంట్, సుబ్బరాజు మంచినీళ్ళు త్రాగించడం చూసిన నాయుడి భార్య, కూతురు సాక్ష్యం, సుబ్బరాజు నాయుడి ఇంటికి వెళ్ళడం ఆశ్చర్యంగా చూసిన జనం చెప్పిన సాక్ష్యాధారాలతో కేసు బలపడింది.

ఆ కేసులో నుంచి బైట పడితే చాలు ఏడుకొండలూ ఎక్కి వచ్చి భార్యతో సహా నిలువు దోపిడీ ఇస్తానని మొక్కుకుని గడ్డం పెంచుకుని కోర్టుచుట్టూ, లాయరు చుట్టూ, తిరుగుతున్నాడు సుబ్బరాజు. ●

---

చురకలు :

### పోలిక

అసందర్భపు ఆవేశం
పైరింజన్నే తగలబెట్టటం

అలిశెట్టి ప్రభాకర్

---

చురకలు :

### ఫినిష్

ఆస్తంతా అమ్మేస్తే ప్రొడ్యూసరు
కాస్తంతా మైండుంటే డైరెక్టరు

అలిశెట్టి ప్రభాకర్